క్లుప్తంగా

వడగాల్పులతో విలవిల



నందిగామ: నందిగామ ప్రాంతంలో పగటి ఉష్ణోగ్రతలు ఆదివారం కొద్దిమేర తగ్గాయి. అయితే వడగాల్పులు మాత్రం అధికంగా వీచడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. నందిగామలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు 42.2 డిగ్రీలు గా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.వడగాలుల దెబ్బకు నందిగామలోని రోడ్లన్నీ ఉదయం 11గంటల తర్వాత నిర్మానుష్యంగా మారాయి. ప్రధానమైన గాంధీసెంటర్, సీఎంరోడ్డు తదితర ప్రాంతాల్లో జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

సత్యసాయి సేవాసమితి సేవలు అభినందనీయం



నందిగామ టౌన్: స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని లింగాలపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సత్యసాయిబాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన సత్యసాయి సేవాసమితి నిర్వాహకులను అభినందించారు. వారి సేవలను కొనియాడారు. సర్పంచి బొల్లినేని పద్మజ, ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు, నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

రూ.5వేల జరిమానా

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బహిరంగ వేలం ద్వారా లైసెన్స్ హక్కు పొందినవారు ఆయా వస్తువులను నిర్దేశించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే జరిమానా విధించడంతోపాటు లైసెన్స్‌ను రద్దు చేస్తామని ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు హెచ్చరించారు. భక్తులు అధికంగా వచ్చే శుక్ర, ఆదివారాల్లో ఆయా వస్తువులను అధికంగా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొబ్బరికాయను రూ.40కే విక్రయించాల్సి ఉండగా, భక్తులకు రూ.50లకు విక్రయించిన దుకాణదారుడికి రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. నిర్ణీత ధరలకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. నిబంధనలు పాటించనివారి దుకాణాల లైసెన్స్‌లను రద్దుచేస్తామని ఈవో హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామసమీపంలోగల అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే రాష్ట్రంలోకి అనుమతించాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమంగా మద్యం, నగదు, బంగారం రవాణా కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ మహాలక్ష్మణుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

చందర్లపాడు(నందిగామ): ప్రతి ఓటరు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్సై ఆర్.ధర్మరాజు సూచించారు. చందర్లపాడు మండలం కొడవటికల్లులో ఆదివారం రాత్రి ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఐ ధర్మరాజు మాట్లాడుతూ ప్రజలలో ధైర్యాన్ని నింపేందుకు పోలీసుకవాతు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

129 మద్యం సీసాలు స్వాధీనం



నందిగామ: అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.కోటేశ్వరరావు తెలిపారు. తెలంగాణ నుంచి ద్విచక్ర వాహనంపై మద్యం తీసుకువస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం స్థానిక ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 129 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఈబీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని వివరించారు.

మనబడి మారింది





కొల్లికూళ్ల పాఠశాలలో ఆర్వోప్లాంట్ నుంచి మంచినీరు తాగుతున్న విద్యార్థులు



ముచ్చింతాలలో డిజిటల్ క్లాసులు వింటున్న విద్యార్థులు



ముండ్లపాడులో రన్నింగ్ వాటర్‌తో కూడిన టాయిలెట్లు

విద్యా ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. పేదల అభ్యున్నతికి చదువు ఒక్కటే మార్గంగా భావించి,.. మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. పెచ్చులూడిన శ్లాబులు, పగిలిపోయిన ఫ్లోర్, చాలీచాలని తరగతి గదులు, మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం లేక కునారిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలకు నాడు–నేడు పథకంతో మహర్దశ పట్టించారు. పేదల పిల్లలకు మనమిచ్చే ఆస్తి చదువే అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యరంగంపై ప్రత్యేక దృష్టిసారించి, సరస్వతీ నిలయాలను నేడు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అందుకు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అదనపు తరగతి గదులు, డెస్కులతో కూడిన బల్లలు, గ్రీన్‌చార్ట్ బోర్డు, డిజిటల్ తరగతులు, విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం, విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్ ఇలా కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగానే విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు, వసతులు కల్పించారు.



జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులు

ఎనిమిదోతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. నాడు–నేడు పథకం కింద జగ్గయ్యపేట మండలంలోని 82 పాఠశాలలను రూ.29.04కోట్లతో, పెనుగంచిప్రోలు మండలంలోని 47 పాఠశాలలను 14.97కోట్లతో, వత్సవాయి మండలంలోని 50 పాఠశాలలను 14.79కోట్లుతో కలిపి మొత్తం రూ.58.80కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేశారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి వసతులు సమకూరడంతో తల్లిదండ్రులు, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపిస్తున్నారు.

దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. కార్పొరేట్ పాఠశాలల్లో ఓ విద్యార్థికి వేలాది రూపాయలు ఖర్చుచేస్తే తప్ప అందని ఆధునిక వసతులతో కూడిన విద్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద పిల్లలకు ఉచితంగా అందిస్తుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజికవేత్తలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వారు చెబుతున్నారు. – పెనుగంచిప్రోలు



కొణకంచిలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన పాఠశాల ఆవరణ



కొణకంచి పాఠశాలలో నిర్మించిన వంటగది



ముచ్చింతాల పాఠశాలలలోని మరుగుదొడ్లు



ఆహ్లాదకర వాతావరణంలో వత్సవాయి మండలం కంభంపాడులోని ప్రాథమిక పాఠశాల



ముండ్లమూరు స్కూల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన డెస్కులతో కూడిన బల్లలు



కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న కొణకంచి ఆదర్శ ప్రాథమిక పాఠశాల

మంచి చేయడంలో ఎంతో సంతృప్తి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నమ్మి ఓట్లేసిన ప్రజలకు మంచి చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ ఉండదని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. తాను ఈ ఐదేళ్ల ప్రజాసంక్షేమం, నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పట్టణంలోని చిన్న మసీదు రోడ్డు ప్రాంతంలో ఆదివారం అయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చి సగర్వంగా మీ ముందుకు వచ్చి ఓటు అడుగుతున్నానని ఓటర్లకు వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

అభివృద్ధిపథంలో నందిగామ..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో మూడు దశాబ్దాలుగా జరగని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఐదేళ్లలో చేసి చూపించానని తెలిపారు. ముఖ్యంగా నందిగామలోని అన్నివార్డుల్లో ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. తమ ప్రభుత్వం చేసిన మంచిని, అభివృద్ధి, సంక్షేమాన్ని చెప్పి ఓట్లు అడుతున్నామని తెలిపారు. తమ పాలనలో కులమతాలు, పార్టీలు, రాజకీయాలు చూడకుండా ప్రతి ఒక్కరికి పథకాలు



నందిగామ ఏడోవార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

అందించామని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే పేదలకు మరింత న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించి నందిగామ అభివృద్ధికి సహకరించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, కౌన్సిలర్ షేక్ ఖాలిక్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, నాయకులు గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, రామినేని నరసింహారావు, షేక్ జాఫర్, పాకాలపాటి కిరణ్, ఓర్సు జ్వాలా, బండారు శేషు, వడ్డెల్లి శ్రీను, రాచూరి సీతారాం, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పిల్లి జయరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక రంజాన్ పండుగ





పెద్ద మసీదులో ఇఫ్తార్ విందును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, చిన్న మసీదులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్సీ అరుణకుమార్

- నందిగామలో ఇఫ్తార్ విందు
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నందిగామ టౌన్: రంజాన్ పండుగ త్యాగనిరతికి ప్రతీకని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పెద్ద మసీదు, చిన్న మసీదుల్లో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈసందర్భంగా కేశినేని, జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదన్నారు. రంజాన్ పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం ఇఫ్తార్ విందును వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ముతావలి మహ్మద్‌ఖాజా, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు ఎండీ అమీన్, యాకుబ్ అలీ, షేక్ కరిముల్లా, ఎండీ అల్తాఫ్, షేక్ ఖాలిక్, షేక్ జాఫర్, మున్నా, కమాల్, షేక్ మీరా, రజ్వీ, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాములపాటి రమేష్, మన్నెం దాసు, షేక్ రసూల్, మువ్వల శ్రీను, పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.

టీడీపీ తీరు నచ్చకే వైఎస్సార్ సీపీలోకి చేరికలు

నందిగామ టౌన్: తెలుగుదేశం పార్టీ విధానాలు, పేదల విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న తీరు నచ్చక టీడీపీ నేతలు పెద్దఎత్తున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎంపీ, విజయవాడ పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొమ్ముకూరు విజయరాజు ఆయన అనుచరులతో కలిసి ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన విజయరాజుకు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తో కలిసి ఎంపీ కేశినేని నాని, పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో పేదలను అవహేళన చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ ప్రాంతంపై మక్కువ, సమాజంపట్ల చిత్తశుద్ధి కలిగిన విజయరాజు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరటం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ నందిగామ నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో పేదరికం



విజయరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

ఏడు శాతం తగ్గిందని నీతిఆయోగ్ ప్రకటించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు నిదర్శనమన్నారు. సంపద సృష్టిస్తా సంక్షేమ పథకాలు అందిస్తానని చంద్రబాబు చెబుతున్నారని, 2014 నుంచి 19వరకు ఆపని ఎందుకు చేయలేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా వృద్ధి రేటు పెరిగిందని వివరించారు. పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాములపాటి రమేష్, మాదుగుల మనోహర్ పాల్గొన్నారు.

వాసుకు ఉదయభాను నివాళి

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల మృతిచెందిన మున్సిపల్ కాంట్రాక్టర్ సంభంగి శ్రీనివాసరావు(వాసు) దశదిన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదివారం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక అయ్యప్పనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించినవారిలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎండీ అక్బర్, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ నాయకులు బద్దూనాయక్, కాశి కిషోర్, ప్రభాకర్‌రెడ్డి, చిరంజీవి, గోగుల వెంకయ్య, వాసు మిత్రులు ఉన్నారు.



వాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విప్ ఉదయభాను, రాఘవేంద్ర తదితరులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామ: ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. వివాదాలకు పోయి జైలుపాలు కావద్దని హెచ్చరించారు.

ఆర్థిక సాయం

నందిగామ: మండలంలోని పెద్దవరం గ్రామానికి చెందిన మార్గపూడి బాలయ్య గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి కంపాషన్ కమ్యూనిటీ ఆఫ్ పెద్దవరం (సీసీఎస్‌పి) ఆధ్వర్యంలో ఆదివారం రూ.4వేలను ఆర్థికసాయం అందజేశారు. తమ సంస్థ తరపున బాధితులకు అండగా నిలుస్తున్నట్లు సీసీఎస్‌పీ అధ్యక్షుడు నరేంద్ర తెలిపారు.

దుకాణదారుల సమస్యలు పరిష్కారం



పెనుగంచిప్రోలు:స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద చిరు వ్యాపారాలు చేసుకునే దుకాణదారుల సమస్యలు తక్షణం పరిష్కరిస్తామని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు తెలిపారు. ఆలయం వద్దనున్న దుకాణాలు గతేడాది ప్రమాదవశాత్తు కాలిపోవటంతో వారికి ఆలయ క్యాంటీన్ పక్కన దుకాణాలు నిర్మించారు. అయితే అక్కడ వ్యాపారాలు సాగకపోతుండటంతో వ్యాపారులు ఆ దుకాణాలను మూసేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వ్యాపారులను పిలిపించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని దుకాణాలు తెరుచుకోవాలని వ్యాపారులకు సూచించారు. దీంతో వ్యాపారులు హర్షం వ్యక్తంచేస్తూ తిరిగి దుకాణాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి : ఎమ్మెల్సీ అరుణకుమార్

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమైందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చెవిటికల్లు, బత్తినపాడు గ్రామాల్లో శనివారం రాత్రి ఆయన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు ఎంతో కృషి చేశారన్నారు.కరోనా కాలంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఒంటరిగా స్కూటీపై పర్యటించి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని వారికోసం పనిచేశారని గుర్తుచేశారు. చెవిటికల్లు, బత్తినపాడు గ్రామాల సర్పంచులు బుడ్డి విజయలక్ష్మి, , జంగా సంతోషరావు, పార్టీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, నాయకులు చింతా రవీంద్రనాథ్, వెలగలేటి బాబు, వాసు, మోహనరావు, బళ్లా రాములు, బుడ్డి సత్యనారాయణ, రాయల నరసింహారావు పాల్గొన్నారు.